ఘనంగా సదర్ సమ్మేళనం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 2 : రాజేంద్ర నగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో సదర్ సమ్మేళనం అంగరంగ వైభవంగా కొనసాగింది. అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. యాదవ సోదరులు దున్నలను అందంగా ముస్తాబు చేసి డీజే పాటలతో నృత్యాలు చేయిస్తు పాల్గొన్నారు. సదర్‌లో పాల్గొన్న దున్నలకు బహుమతులు అందజేసి నిర్వహకులను సన్మానించారు. సమావేశంలో కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. పాడి పశువులను పూజించే సంస్కృతి మనదేశంలో ఉందన్నారు. యాదవులు దున్న రాజులకు పూజలు చేయడం ఈ పండుగ వాతావరణంలో దున్న రాజులను కొలవడం ఆటపాటలతో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రఘుయాదవ్, ఎస్. వెంకటేశ్ పాల్గొన్నారు.

నారాయణగూడలో సదర్ అదుర్స్..

హిమాయత్‌నగర్ : నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలో శనివారం రాత్రి సదర్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. దున్నపోతుల నృత్యాలు, డప్పుల దరువుకు కళాకారుల నృత్యాలు .. ఆట పాటలతో దద్దరిల్లింది. దున్న పోతులు చేసిన వీరాంగాన్ని తిలకించిన చిన్నారులు,మహిళలు ఆనంద పరవశులయ్యారు. సదర్ ఉత్సవాలల్లో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, యాదవ సంఘం నాయకులు నీలం శ్రీనివాస్‌యాదవ్, సి.వినోద్‌యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్, నవంబర్ 2 : విద్యుత్ కేబుళ్ల మార్పిడి, మరమ్మతులు, చెట్లకొమ్మల కత్తిరింపు, మెయింటెనెన్స్ పనుల కారణంగా సోమవారం బంజారాహిల్స్ సబ్‌డివిజన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టీఎస్‌పీడీసీఎల్ బంజారాహిల్స్ ఏడీఈ గోపి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి అరుణోదయ కాలనీ, జై హింద్ ఎన్‌క్లేవ్, స్విమ్మింగ్ పూల్ లేన్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఇమేజ్ గార్డెన్, సిలికాన్ వ్యాలీ, సైబర్ హిల్స్ కాలనీ ప్రాంతాల్లో, జూబ్లీహిల్స్ ఫీడర్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్‌నం 36, 41, 55, పెద్దమ్మ గుడి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల దాకా జూబ్లీహిల్స్ రోడ్ నం. 36, 54, 56, 57, 58,59,60 ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

రోడ్లకు మరమ్మతు పనులు ప్రారంభం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని మణికొండ మున్సిపల్ 19వ వార్డు కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం తమ వార్డులో రహదారులపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేసేందుకు మున్సిపల్ సిబ్బందితో పనులు చేపట్టారు. శనివారం పనులను పరిశీలించి నాణ్యతాప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. మణికొండ మున్సిపాలిటీలో సమస్యలను గుర్తిస్తూ సమస్యలు పరిష్కరించేందుకు పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

- మణికొండ

కొనసాగుతున్న ఉద్యోగుల ఆందోళన

జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాలను జేఎన్‌ఎఫ్‌ఏయూకు కేటాయించడాన్ని నిరసిస్తూ యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. శనివారం మధ్యాహ్న భోజన విరామంలో నిరసన చేపట్టారు. డైరెక్టరేట్ మెటీరియల్స్ అండ్ పబ్లికేషన్స్ ఎదుట బైఠాయించిన ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రొ.ఆనంద్ పవార్, డా.పరాంకుశం వెంకటరమణ, జేఏసీ కన్వీనర్ ప్రొ. వడ్డాణం శ్రీనివాస్, చైర్‌పర్సన్ ప్రొ.పల్లవి కాబ్డే, ప్రొ.పుష్పా చక్రపాణి, డా.ప్రమీల కేతావత్, రాజాబాబు. డా. యాకేశ్ దైదా పాల్గొన్నారు.

- బంజారాహిల్స్

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తాం

ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్, నవంబర్ 2 : జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించే ప్రక్రియలో భాగంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ అన్నారు. శనివారం పెద్దమ్మ గడి కమాన్ సమీపంలోని ఫుట్‌పాత్‌లు, రోడ్డు ఆక్రమణను ఏసీపీ హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. గుడి బ్యాక్‌గేట్ నుంచి రోడ్ నం.36 వైపు రోడ్డుఇరుగ్గా ఉండడంతో ట్రాఫిక్‌జామ్ అవుతోందని, నాలా మీద ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని పార్కింగ్‌కు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలా మీద స్థలాన్ని పక్కనున్న భవన యజమానులు సొంతంగా వాడుకునిగ్రిల్స్ ఏర్పాటు చేసుకున్నారని, ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. ప్రధానరోడ్డుపై ఉన్న ఆలయ కమాన్ చుట్టుపక్కల చిరు వ్యాపారులు షాపులు పెట్టడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న విషయాన్ని గుర్తించి వాటిని తొలగింపజేశామని పేర్కొన్నారు. ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా రోడ్డుపై ఆక్రమణలు తొలగించేలా చూస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేయిస్తామన్నారు.

రహదారుల సమస్యలు పట్టించుకోండి

ఖానాపూర్ నుంచి వట్టినాగులపల్లి వెళ్లే రహదారిలో గుంతలు పడి ఉన్న దృశ్యం

మణికొండ, నవంబర్ 2 : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో కొన్నాళ్లుగా రహదారుల సమస్యలను పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. కాంట్రాక్టర్ల కమీషన్ల కోసం అధికారులు నిధులను కేటాయించి కమీషన్లు దోచేందుకు ప్రజాప్రతినిధులు తమ విధులను నిర్వహిస్తూ కాలయాపన చేస్తున్న పరిస్థితులు మున్సిపాలిటీలో దాపురించాయి. ఫలితంగా ఈ మున్సిపాలిటీలో రహదారుల దుస్థితి దయనీయంగా తయారైంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ నుంచి వట్టినాగులపల్లి వెళ్లే రహదారిలో 200 గుంతలకు పైగా దర్శనమిస్తున్నాయి.

ఈ రహదారి వేసిన ఆరు మాసాలకే గతుకుల మయంగా మారినా.. అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. మున్సిపాలిటీలో పుష్కలమైన నిధులు ఉన్నప్పటికీ వాటిని వెచ్చించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అడ్డంగా నరికేస్తున్నారు..

బంజారాహిల్స్, నవంబర్ 2 : ప్రభుత్వం పచ్చదనాన్ని పెంచేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే జీహెచ్ఎంసీ సిబ్బంది కాసులకు కక్కుర్తి పడుతూ చెట్ల కొమ్మల నరికివేతకు సహకరిస్తున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి రోడ్ నం.36లో ఓ డయాగ్నిస్టిక్ సంస్థ ఎదుట ఏపుగా పెరిగిన ఐదారు చెట్ల కొమ్మలను అనుమతులు లేకుండా యూబీడీ సిబ్బంది విచక్షణా రహితంగా తొలగించారు. శనివారం ఉదయం క్రేన్‌తో వచ్చిన సిబ్బంది 15 అడుగుల చెట్లకు చెందిన కొమ్మలను తొలగించడంతో బోసిబోయి కనిపిస్తున్నాయి. నమస్తే తెలంగాణకు కొందరు స్థానికులు ఫిర్యాదు చేయగా అక్కడకు వెళ్లేసరికి చెట్లకు సంబంధించిన కొమ్మలను దారుణంగా నరికివేయడంతో పాటు భారీ వేపవృక్షాన్ని సైతం కొమ్మలు తొలగించేందుకు యత్నిస్తున్న విషయం బయటపడింది. అటవీశాఖ అనుమతులు లేకుండా అడ్డగోలుగా చెట్లను ధ్వంసం చేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రధాన రహదారులన్నీ కాంక్రీట్ జంగల్‌ను తలపిస్తుండగా ఏపుగా పెరిగిన చెట్లను కొట్టివేస్తుండడం దారుణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు

మణికొండ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఇబ్రహీంబాగ్ ఏఈ కె.సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్, నార్సింగి సెక్షన్ ఆఫీస్‌లో సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థానలు

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్‌తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. దాత్రీ కాలనీ, పద్మశ్రీహిల్స్ సీసీ రోడ్డు నిర్మాణం, తెలంగాణ పోలీస్‌అకాడమీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు శ్రీలతాసురేశ్ గౌడ్, సాగర్ గౌడ్, పద్మావతి పాపయ్య యాదవ్, ముద్దం రాము, మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, పోలీస్ అధికారులు, నాయకులు కృష్ణారెడ్డి, రాజు.ఎస్.రాజు, సంగారెడ్డి, ఖాజాపాషా, అమీన్ పాల్గొన్నారు.

- బండ్లగూడ

పోలీసులపై దురుసు ప్రవర్తన

- ఐదుగురిపై కేసు నమోదు

బంజారాహిల్స్ : డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది.వివరాల్లోకి వెళ్తే.. కవాడిగూడకు చెందిన ఐటీ ఉద్యోగి సిద్ధార్థ తన స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి జూబ్లీహిల్స్‌లోని క్లబ్ రోగ్ పబ్‌లో శుక్రవారం రాత్రి విందు ముగించుకుని కారులో బయలుదేరాడు. పార్క్‌హయత్ హోటల్ వద్దకు రాగానే బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల కోసం ఆపారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేసేందుకు యత్నించగా సిద్ధార్థ, అతడి స్నేహితుడు శేష సాయిప్రసాద్, కుటుంబసభ్యులు వాగ్వాదానికి దిగి దుర్భాషలాడారు. వీడియోలు తీస్తూ విధులకు అడ్డుకున్నారు. సిద్ధార్థకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించగా 70 బీఏసీ పాయింట్లు వచ్చింది. విధులు అడ్డగించడంతో పాటు బెదిరింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఎస్సై గోవర్ధన్‌రెడ్డి ఫిర్యాదుతో సిద్ధార్థ, శేష సాయిప్రసాద్‌తో సహా ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

బీసీ కులగణన సమగ్రంగా చేయడానికే..

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, తదితరులు

శంషాబాద్ రూరల్, నవంబర్ 2 : బీసీ కులగణన సమగ్రంగా చేయడానికే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శనివారం శంషాబాద్ మండలంలోని పద్మావతి ఫంక్షన్‌హాల్‌లో బీసీ కులగణన, సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేయడానికి అధికారులు, పార్టీ కార్యకర్తలు సహకరించాలని సూచించారు. ప్రతి కుటుంబంలో సభ్యులు తమ పూర్తి వివరాలు సమోదు చేయాలని సూచించారు. బీసీ కులగణన పూర్తి చేస్తేనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.

సమావేశంలో జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 2 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మిగూడ రాజీవ్‌గృహకల్పలో పల్లె కృష్ణమూర్తి నివాసం ఉంటున్నాడు. మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటి వద్దనే ఉంచుకోని చూసుకుంటున్నారు. గత నెల 24న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసిన ఆచూకీ లభించలేదు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురికి కారుణ్యనియామకాలు

జలమండలిలో ఎంపికైన ఉద్యోగులతో ఎండీ అశోక్‌రెడ్డి

సిటీబ్యూరో (నమస్తే తెలంగాణ) : జలమండలిలో ఐదుగురికి కారుణ్యనియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగానే మరణించిన ఐదుగురు ఉద్యోగుల వారసులకు విద్యార్హతను బట్టి కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఈ మేరకు ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో శనివారం ఎండీ అశోక్ రెడ్డి ఈ నియామక పత్రాలు అందించి, ఆయన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ కష్టపడి పనిచేసి బోర్డుకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఈ ఎన్సీ రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, పీ అండ్ ఏ సీజీఎం మహ్మద్ అబ్దుల్‌ఖాదర్‌పాల్గొన్నారు.

నమ్మి ఆశ్రయం కల్పిస్తే ఆభరణాల చోరీ

బంజారాహిల్స్ : నమ్మి ఆశ్రయం, పని కల్పించిన యువతిని మోసం చేసి ఆభరణాలతో ఉడాయించిన మహిళపై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే..ఒరిస్సాకు చెందిన గీతాంజలి మహాపాత్ర బంజారాహిల్స్ రోడ్ నం.14లోని రోజ్ ట్రీ కాఫీషాప్‌లో రిసెప్షనిస్ట్. ఇటీవల ఒరిస్సాకు చెందిన కల్యాణి బెహెరా తన ఎనిమిదేళ్ల కొడుకుతో నగరానికి వచ్చింది. పని ఇప్పించాలని గీతాంజలిని కోరింది. ఉద్యోగం చూస్తానని, అప్పటివరకు తన ఇంట్లోనే ఉంటూ పనులు చూసుకోవాలని గీతాంజలి ఆమెకు సూచించింది. గత నెల 29న గీతాంజలి ఆఫీస్‌లో ఉండగా కల్యాణి ఫోన్‌చేసి తన కొడుకుకు హాస్టల్‌లో సీటు వచ్చిందని, ఊరెళ్లి చేర్పించి వస్తానంటూ చెప్పింది. అంగీకరించిన గీతాంజలి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చింది. మరుసటిరోజు సాయంత్రం లగేజ్ బ్యాగ్‌లో పెట్టిన రూ. 10వేలు కనిపించకపోవడంతో పాటు రెండున్నర తు లాల బంగారు చెవిరింగులు, 5 గ్రాముల వెండి బ్రాస్‌లెట్ మాయమయ్యాయి. అన్ని చోట్లా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కల్యాణి మీద అనుమానం వచ్చి ఫోన్ చేయగా స్పందించ లేదు. శనివారం బాధితురాలు గీతాంజలి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమగ్ర అభివృద్ధి కోసం కుటుంబ సర్వే

మాట్లాడుతున్న డీసీ జాకియా సుల్తానా, పాల్గొన్న టీచర్లు, సిబ్బంది

జూబ్లీహిల్స్, నవంబర్ 2 : సమగ్ర అభివృద్ధి కోసం చేస్తున్న కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా ఆదేశించారు. సర్వే సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. శనివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో చేపట్టనున్న సర్వేపై సిబ్బందికి మూడో విడుత శిక్షణ నిర్వహించారు. అన్నివర్గాల సమగ్రాభివృద్ధికి చేపట్టనున్న సర్వేకు అందరూ సహకరించాలని కోరారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశవర్కర్లను ఎన్యుమరేటర్లుగా.. సూపర్‌వైజర్లుగా నియమించి శిక్షణ ఇచ్చామన్నారు. మూడో విడుతలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ప్రైవేట్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. టీచర్లు వాణి, లక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ సెషన్‌లో యూసీడీ డీపీఓ వెంకటకిషన్ రావు, ఏఎంసీ కమల్, డీఈ భానుచందర్, ఎస్ఎస్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సర్వేపై గంపెడనుమానాలు.. సిబ్బందికి కత్తిమీద సాము..

సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజల్లో గంపెడనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన పేరిట చేపట్టనున్న సర్వేలో వైద్య సదుపాయాలకు సంబంధించిన వివరాలు లేవు. ఒక కుటుంబానికి చెందిన వివరాలతో చేపడుతున్న సర్వేలో భూములు, స్థిర, చర ఆస్తులు, రిజర్వేషన్ల ద్వారా పొందిన ప్రయోజనాలు, లబ్ధిపొందిన పథకాల వివరాలు, రుణాలు వంటి ప్రశ్నలు మినహా వైద్య సౌకర్యాలపై వివరాలు లేకపోవడం విశేషం. ప్రధానంగా డిజిటల్ హెల్త్‌కార్డు కోసం సర్వే చేస్తారని ఆశలు పెట్టుకున్న ప్రజలకు ఆ అంశాలే లేకపోవడం నిరాశను కలిగించనుంది. 56 ప్రశ్నలతో 75 కు పైగా సమాధానాలను రాబట్టాల్సిన సుదీర్ఘ ప్రశ్నావళి పూర్తిచేయడం సిబ్బందికి కత్తిమీద సాముగా మారనున్నది. ఎన్నడూ లేని విధంగా రాజకీయ నేపథ్యంపై వివరాల సేకరణ ఆసక్తి రేకెత్తించనున్నది. సర్వే మూడు పేజీల ప్రొఫార్మాను సర్వే సిబ్బంది తమవెంట తెచ్చుకోనున్నారు.

పారిశుధ్య కార్మికురాలు మృతి

బండ్లగూడ : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు లింగాల లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు కమిషనర్ శరత్‌చంద్ర శనివారం ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలకు ప్రభుత్వం తరపున రూ.10 వేలు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

రీజెన్స్ కళాశాల ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు

అంతర్జాతీయ చెఫ్స్ డే వేడుకల్లో భాగంగా బంజారాహిల్స్‌లోని రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా రీజెన్సీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేయడంతో పాటు దివ్యాంగ చిన్నారులకు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నదానం కార్యక్రమాలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రమేశ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

- బంజారాహిల్స్

భక్తి శ్రద్ధలతో ఆల్ సోల్స్ డే

క్రైస్తవులు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నారాయణగూడలోని క్రైస్తవుల సెమిట్రీలో వారి పూర్వీకుల సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి, పూలు వేసి ప్రార్థనలు చేశారు. నిర్వాహకులు ఇబ్బందులు కలుగకుండా విద్యుత్ కాంతులు ఏర్పాట్లు చేశారు.

- హిమాయత్ నగర్

పెండ్లి చేసుకుంటానని మోసం

వెంగళరావునగర్, నవంబర్ 2 : ప్రేమించి.. పెండ్లి చేసుకుంటానని నిమ్మించి.. యువతిని గర్భం చేసి మోసం చేశాడు. ఈ ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీ, గుంటూరు జిల్లా, ఇటుకూరుకు చెందిన యువతి నగరానికి వచ్చి మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటున్నది. ఆ గ్రామానికి చెందిన శివకార్తిక్ దాసరి అక్కడే ఉంటూ ఆమెను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. పెండ్లి చేసుకుంటానని 2018 అక్టోబర్ 27న యాదగిరిగుట్టకు తీసుకెళ్లి ఓ హోటలో లోబర్చుకున్నాడు. మరుసటిరోజు హాస్టల్ వద్ద దింపి వెళ్లిపోయాడు. ఆ తర్వాత స్నేహితుడి ఇంటికి తీసుకువెళ్లి తాళి కట్టి పెండ్లి అయిపోయిందని చెప్పి.. సహజీవనం చేయగా ఆమె గర్భం దాల్చింది. బలవంతంగా అబార్షన్ ట్యాబ్లెట్లు వేయగా..తీవ్ర రక్తస్రావమై కడుపులోని పిండం ఛిద్రమైంది. అనారోగ్యంతో ఆమె తన స్వగ్రామానికి వెళ్లిపోయింది. నగరానికి వచ్చిన యువతిని 2021 జనవరిలో పెండ్లి చేసుకుంటానని నమ్మించి కోరికను తీర్చుకున్నాడు. ఎంతకీ పెండ్లి చేసుకోకపోవడంతో మోసపోయానని గుర్తించిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉన్నది.

మెడికల్ సీటు ఇప్పిస్తానంటూ..

ఖైరతాబాద్, నవంబర్ 2 : మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానంటూ డబ్బులు తీసుకున్న కేసులో నిందితుడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రికి చెందిన బత్తల శ్యామ్ ప్రసాద్ లక్డీకాపూల్‌లోని వినాయక్‌నగర్‌లో ఉంటున్నాడు. 2022 అక్టోబర్‌లో డీపీ కాలనీకి చెందిన విజయకు మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానంటూ నమ్మించి రూ.1.18లక్షలు తీసుకున్నాడు. సీటు ఇప్పించకపోవడంతో గతేడాది జనవరిలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పాత సభ్యులతో.. ప్రక్షాళన ఎలా అవుతుంది

ఖైరతాబాద్, నవంబర్ 2 : ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీ ప్రక్షాళన చేపడుతామని చెప్పి పాత సభ్యులనే ఎంపిక చేశారని యుగ తులసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె. శివకుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. చట్టవ్యతిరేకంగా రెండు పర్యాయాల కంటే ఎక్కువగా పనిచేస్తున్న వారినే చేర్చుకున్నారన్నారు. ప్రభుత్వ విడుదల చేసిన జాబితాలో గత ప్రభుత్వ హయాంలోనే పనిచేసిన వారున్నారని అన్నారు. తిరుపతి లడ్డూ కల్తీ జరిగిందని వాదించిన సీఎం ఇప్పుడు ఏం సమాధానం చెబుతారన్నారు. ఏపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డిసెంబర్ 5న తిరుపతిలో ఆమరణ దీక్ష చేస్తున్నామని తెలిపారు.

శ్రీకృష్ణానగర్‌లో రోడ్డే నాలా..



జూబ్లీహిల్స్, నవంబర్ 2 : యూసుఫ్‌గూడలో వర్షం వస్తే రోడ్లు నాలాలుగా మారిపోతున్నాయి. ముఖ్యంగా శ్రీకృష్ణా నగర్ 'బీ' బ్లాక్ చిన్న వర్షానికే ముంపునకు గురవుతున్నది. ఈ ప్రాంతంలో అరగంట దంచికొట్టే వర్షానికి సైతం కార్లు, వాహనాలు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంటున్నది. యూసుఫ్‌గూడలో ఉన్న ఒకటి.. రెండు నాలాలు ఆక్రమణలకు గురై పూడికతీసే దారిలేక మూసుకుపోతున్